సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం। 22। జనవరి। 2023



టమాట కిలో రూ.16
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధరలు గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరి రూ.10 పలికాయి. మార్కెట్‌కు 840 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 26 టన్నులు వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.5°/12.6°
జిల్లాలో శనివారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'ఖేలో ఇండియా'కు పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఖేలో ఇండియా కార్యక్రమానికి సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పకుండా తమ పాఠశాలల పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్ సూచించారు. జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని కోరారు. త్వరలో జిల్లాలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్లు 94902 00056, 94408 69884 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యవసాయ పరికరాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాల తయారీ, సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ చేతన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ వీడర్లు, రోటావేటర్లు, ఆయిల్ ఇంజిన్లు, నీటి సరఫరా పైపులు అందించాల్సి ఉంటుందన్నారు. సరఫరాదారులు ఈనెల 27 లోపు కొటేషన్లు తయారుచేసి Daosathyasai@gmail.comకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.

'పురం' విద్యార్థినికి ప్రతిష్టాత్మక అవార్డు



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నుంచి అవార్డు అందుకుంటున్న ముస్కాన్

హిందూపురం టౌన్: హిందూపురం పట్టణానికి చెందిన విద్యార్థిని మహమ్మద్ ముస్కాన్ బానుకు ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. కేకే ఆచార్జీ మెమోరియల్ జాతీయ అవార్డును ఆమె అందుకున్నారు. శుక్రవారం రాత్రి మహారాష్ట్రంలోని నాగ్‌పూర్ యూనివర్సిటీలో జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆమెకు అవార్డు అందించారు. హిందూపురం పట్టణంలోని ముక్కిడిపేటలో నివాసముంటున్న రహమతుల్లా, యాస్మిన్‌ల కుమార్తె ఎం.ముస్కాన్ బాను పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ ఫార్మసీ పూర్తి చేసింది. 2022 విద్యా సంవత్సరంలో డీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 1100 మార్కులకు 1053 మార్కులు సాధించి దేశంలోనే అత్యధిక మార్కులు పొందిన విద్యార్థిగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర ప్రభుత్వం ముస్కాన్ బానును కేకే ఆచార్జీ మెమోరియల్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఓ సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమెకు జాతీయ స్థాయి పురస్కారం వరించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు, గురువులను పట్టణ ప్రముఖులు అభినందించారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కార్యాలయంలో అందించాలని సూచించారు. దరఖాస్తు, పూర్తి వివరాల కోసం https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గృహం.. అధనపు ఆనందం

దేశంలోనే ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగడుగునా లబ్ధిదారులకు అండగా నిలుస్తోంది. లబ్ధిదారులు తమకు నచ్చినట్లుగా కలల గృహాన్ని నిర్మించుకునేందుకు సాయపడుతోంది. తానిచ్చే నిధులకు తోడుగా పావలా వడ్డీకి రుణ సదుపాయం కల్పిస్తోంది.

- ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా సర్కారు చర్యలు
- తానిచ్చే డబ్బుకు తోడు పావలా వడ్డీతో రుణ సాయం
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు
- సంతోషంలో లబ్ధిదారులు



పుట్టపర్తి రూరల్ పరిధి జగరాజుపల్లిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

పుట్టపర్తి అర్బన్: జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకొనే లబ్ధిదారులకు ఏ మాత్రం భారం కాకుండా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు ఆగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఎందుకు ఆగిందో తెలుసుకొని వెంటనే సహాయక చర్యలు చేపడుతున్నారు. హౌసింగ్ అధికారులతో పాటు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అవసరమైన వారికి అదనపు సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. డబ్బు లేక ఇళ్లు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలతో పాటు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకూ రుణ సాయం అందిస్తూ సంతోషం పంచుతున్నారు.

రూరల్ పరిధిలో రూ.67 కోట్ల రుణం..

జిల్లాలో ధర్మవరం,పుట్టపర్తి, కదిరి, హిందూపురం, మడకశిర, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలోని రూరల్ గ్రామాల్లో 28,316 లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 19,153 మందికి అదనపు సాయం కింద రూ.35 వేలు మంజూరు చేశారు. ఆయా గ్రామాల బ్యాంకుల నుంచి సుమారు రూ.67 కోట్లు అందించారు. పునాది దశ దాటిన మరో 4,601 ఇళ్లకు అదనపు సాయం మంజూరు కావాల్సి ఉంది.

అర్బన్ పరిధిలో రూ.78.4 కోట్లు..

జిల్లాలో అర్బన్ ప్రాంతాల్లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో 26,811 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 22,414 మందికి అదనపు సాయం కింద రూ.35 వేల చొప్పున సుమారు రూ.78.4 కోట్లు అందించారు. పునాది దశలో ఉన్న 4,397 మందికి అదనపు సాయం త్వరలో అందనుంది.

అదనపు రుణం పొందాలంటే..

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండాలి. కంతులు సక్రమంగా చెల్లిస్తూ ఉండాలి. అలాంటి వారికి రూ.35 వేలు మంజూరు చేస్తారు. దీన్ని తిరిగి కంతుల ప్రకారం చెల్లించాలి. కేవలం పావలా వడ్డీ మాత్రం చార్జీ చేస్తారు. జిల్లాలో 58,860 మంది జగనన్న కాలనీల్లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీరిలో 55,127 మంది లబ్ధిదారులు సంఘాల్లో ఉన్నారు. వీరందరూ అదనపు సాయానికి అర్హులే. దీంతో పాటు ఉన్నతి పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు రుణం మంజూరు చేస్తారు. దీన్ని సైతం ఇళ్ల నిర్మాణాలకు వినియోగించుకోవచ్చు.

58,860
జిల్లాలో ఇళ్ల లబ్ధిదారులు

రూ. 1.80 లక్షలు
ప్రభుత్వం అందించే మొత్తం

రూ. 35-50 వేలు
తాజాగా బ్యాంకుల ద్వారా అందించే రుణం

41,567
ఇప్పటివరకూ అదనపు సాయం పొందిన వారు

8,998
త్వరలో అందుకోనున్నవారు

చాలా సంతోషంగా ఉంది



ఇంటి నిర్మాణానికి ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రభుత్వం అదనపు సాయం అందించడం చాలా సంతోషంగా ఉంది. ఈ రుణాన్ని సద్వినియోగం చేసుకొని పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను పూర్తి చేస్తాం. ఎవరి ప్రమేయం లేకుండానే స్థలం, ఇల్లు, రుణ సహాయం చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. – షాహీన, పెదపల్లి, పుట్టపర్తి మండలం

అర్హులందరికీ మంజూరు



జగనన్న ఇళ్లు పూర్తి చేయడానికి అవసరమైన అదనపు సాయం కోసం గ్రామాల్లో వైకేపీ సిబ్బందితో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. చాలామంది పేర్లు ఇవ్వడంతో రుణాలు మంజూరు చేయగలిగాం. ఇంకా ఎవరైనా ఉంటే రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన అందరికీ మంజూరు చేస్తాం. – నరసయ్య,పీడీ, డీఆర్‌డీఏ

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వం లక్షలాది రూపాయల విలువ చేసే ఇంటి స్థలంతో పాటు నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోంది. ఇదీ చాలక పోతే అదనపు సాయంగా రూ.35 వేల రుణాన్ని తీసుకొని నిర్మాణ పనులు పూర్తి చేయాలి. లబ్ధిదారులకు ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం. – చంద్రమౌళిరెడ్డి, పీడీ, హౌసింగ్

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్ల సభ్యులతో జిల్లా కబడ్డీ సంఘం నాయకులు

బత్తలపల్లి:బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో శనివారం జిల్లా సీనియర్స్ మహిళలు, పురుషుల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పురుషుల విభాగంలో 60 మంది, మహిళల విభాగంలో 40 మంది పాల్గొన్నారు. క్రీడాకారులకు కబడ్డీ పోటీలను నిర్వహించి సత్తా చాటిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 25 నుంచి 27 వరకూ విశాఖపట్నం జిల్లా అంకుపాళ్యంలో జరిగే 70వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఖ్యాతిని చాటాలని వక్తలు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, అనంతపురం జిల్లా కబడ్డీ సంఘం ప్రెసిడెంట్ హరినాథ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ ఆచారీ, మంజుల వెంకటేష్, కార్యదర్శి రాగిరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు వీరే...

మహిళల జట్టు..
మేజబి, అయిషా, ప్రియాంక, ప్రవళిక, జయశ్రీ, జ్యోతి, ఉమ, పవిత్ర, వైష్ణవి, హిమజ, ఉష, సాగరికలతో పాటు స్టాండ్ బైగా గంగోత్రి, తన్య, గీతాంజలి, ఇందు.

పురుషుల జట్టు..
సిసింద్రీ, రాజశేఖర్, మధు, గణేష్, మహేష్, గోపీచంద్, నవీన్, సందీప్, శ్రీనా, వంశీ, రాజు, తరుణ్, స్టాండ్ బైగా మణిదీప్, మహేంద్ర ఆచార్య, శివమణి, నాగేంద్రనాయక్, వెంకటేష్.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



సచివాలయ, హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

గోరంట్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం గోరంట్ల పట్టణ సమీపంలోని మల్లాపల్లి, జీనం వాడ్లపల్లి జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డితో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగకల్లా జిల్లాలో 10,600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. సచివాలయ ఇంజినీర్లు, హౌసింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే రద్దు చేయాలని ఆదేశించారు. మల్లాపల్లి జగనన్న కాలనీలో కొంత మంది లబ్ధిదారులు కలెక్టర్‌తో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తైనా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కనెక్షన్ మంజూరు చేయాలని విద్యుత్ శాఖ ఇంజినీర్ శ్రీనివాసులును ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజు, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథ గుప్త, హౌసింగ్ ఏఈ జగదీష్, సచివాలయ ఇంజినీర్లు, జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


విద్యావాహినితో సత్యసాయి ఆశయసాధన



నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు, చక్రవర్తి తదితరులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాబా ఆశించిన మానవతా విలువలు, విజ్ఞానం, సాంకేతికత కలగలిపిన ఆధునిక విద్యను అందించడమే విద్యావాహిని ప్రాజెక్ట్ లక్ష్యమని ప్రాజెక్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వార్షిక సమావేశం నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి చేతుల మీదుగా నూతన వెబ్‌సైట్ ఆవిష్కరించారు. అనంతరం విద్యావాహిని ప్రాజెక్ట్ నిర్వహణలో పాలుపంచుకుంటున్న పలువురు మహిళా ప్రతినిధులు ప్రసంగించారు. సమసమాజ నిర్మాణాన్ని సాధించే లక్ష్యంతో 2010లో విద్యావాహిని ప్రాజెక్ట్‌ను సత్యసాయిబాబా ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఏటా కొత్త కొత్త మార్పులు తీసుకువస్తూ విద్యార్థులకు అత్యుత్తమ విధానాల ద్వారా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. సత్యసాయి ఆశీస్సులతో ప్రాజెక్ట్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావాహిని డైరెక్టర్ కరుణా మున్నీ, విద్యావాహిని సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కరాటే జట్ల ఎంపిక



తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–14, 17, 19 విభాగాల్లో బాల బాలికల కరాటే జట్లను ఎంపిక చేశారు. శనివారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కరాటే అండర్–14లో వివిధ విభాగాల కింద బాలికల జట్టుకు ఏడుగురు, బాలుర జట్టుకు ఏడుగురు, అలాగే అండర్–17, 19లో వివిధ విభాగాల్లో బాలికల జట్టుకు 9 మంది, బాలుర జట్టుకు 9 మంది చొప్పున ఎంపికయ్యారు. ఈ నెల 29న ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, ఎంఈఓ గంగప్ప, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి అంజన్న, ఉమ్మడి అనంతపురం జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరార్జీ యాదవ్, పీడీ లోక్‌నాథ్, కరాటే మాస్టర్ ఫైరోజ్, పీడీలు, కరాటే మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించండి

- టెన్త్ విద్యార్థులకు డీఈఓ మీనాక్షి సూచన

కొత్తచెరువు: జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 26వ తేదీ లోపు రూ.500 చెల్లించవచ్చని, ఆపైన రూ.1,000 అపరాధ రుసుముతో 27 నుంచి 31వ తేదీ వరకూ చెల్లించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయులు www. bse.ap.gov.in వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు కానిస్టేబుల్ ప్రిలిమినరీ

- అనంతపురం, గుత్తిలో 47 పరీక్ష కేంద్రాలు
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరుకానున్న 24,055 మంది అభ్యర్థులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతపురం, గుత్తిలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం 24,055 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా సాగేలా కృషి చేద్దామని అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో నోడల్ అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్లు, పోలీసు అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. సెల్‌ఫోన్, వాచ్‌లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకురాకూడదన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అనంతపురం, గుత్తి సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, డీఎస్పీలు యు.నరసింగప్ప, ఎస్ మహబూబ్‌బాషా, సీఎం గంగయ్య, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుజాత, గుత్తి గేట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఇంటర్ విద్యార్థులకు ఆర్‌ఐఓ సురేష్ బాబు సూచన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ సురేష్‌బాబు

ధర్మవరం: ఈ ఏడాది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉమ్మడి జిల్లా ఆర్‌ఐఓ సురేష్ బాబు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఈ ఏడాది ప్రతి విద్యార్థిని ఉత్తీర్ణత సాధించాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఆదేశించారు.

'ఈ- క్రాప్'పై దృష్టి సారించండి

- జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కనగానపల్లి: ఈ- క్రాప్‌లో రబీ పంటల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) వై.వీ. సుబ్బారావు ఆర్‌బీకేల సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రబీ పంటల ఈ- క్రాప్, పీఎం కిసాన్- ఈకేవైసీ, ఇతర వ్యవసాయ పథకాలపై చర్చించారు. నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ పరిహారం కోసం అర్హులైన రైతులందరితో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వ్యవసాయ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఓ కృష్ణకుమారి, వీఏఏలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


నవీన్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని శీఫారం వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని పావగడ తాలుకా వైఎన్‌ఎస్ కోట పంచాయతీ భీమునికుంటకు చెందిన నవీన్ కుమార్ (27) మూడు నెలల క్రితం పెనుకొండలోని మారుతీనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసయ్యాడు. చెడు వ్యసనాలను నుంచి బయటపడలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తండ్రి, సమీప బంధువులకు ఫోన్ ద్వారా తెలిపి.. శుక్రవారం అర్ధరాత్రి శీఫారం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ కేసు నమోదు చేశారు.

171 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 171 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవ రెడ్డి తెలిపిన మేరకు... అందిన ముందస్తు సమాచారంతో శనివారం ఉదయం 5 గంటలకు అనంతపురం – కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి మండలం తంబాపురం క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీ (ఏపీ39 టీజెడ్6708)ని పరిశీలించగా 171 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో లారీ డ్రైవర్ రాప్తాడుకు చెందిన నరసింహులును అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ధర్మవరానికి చెందిన సూరి అక్రమంగా రేషన్ బియ్యాన్ని రాప్తాడుకు చెందిన ముంటిమడుగు నాగరాజు లారీలో కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా వెలుగు చూసింది. బియ్యం తరలింపుదారులపై 6(ఎ) కేసు నమోదు చేసి, సీజ్ చేసిన వాహనాన్ని, అదుపులోకి తీసుకున్న డ్రైవర్‌ని బత్తలపల్లి పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ బాలకృష్ణయ్య, ఏఈఈ కుళ్లాయిరెడ్డి, సిబ్బంది, బత్తలపల్లి సీఎస్‌డీటీ శారద పాల్గొన్నారు.


సీజ్ చేసిన లారీని చూపుతున్న అధికారులు

జేఎన్‌టీయూలో బదిలీలు, హోదాల్లో మార్పు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పలువురు డైరెక్టర్ల హోదాల్లో మార్పు చేశారు. అలాగే పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

- వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యను జేఎన్‌టీయూ–కలికిరి ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు.
- రిజిస్ట్రార్ సి.శశిధర్‌కు డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ సురేష్‌బాబుకు డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్‌గా కీలకమైన అదనపు బాధ్యతలు అప్పగించారు.
- డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ఉన్న ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యత ఇచ్చారు.
- ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తికి స్పెషల్ ఆఫీసర్, సెంటర్ ఫర్ బ్రిడ్జి, టన్నెల్ ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో నియమించారు.
- జేఎన్‌టీయూ–పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్.వసుంధరను నియమించారు.
- డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్‌తో పాటు ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ వి.సుమలతకు అదనపు బాధ్యతలు అప్పగించారు.
- ఓటీపీఆర్‌ఐలోని బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మిని జేఎన్‌టీయూ–కలికిరి విభాగాధిపతిగా నియమించారు.

క్రీడలతో మానసిక వికాసం

- బెస్ట్–యూ స్పోర్ట్స్ డేలో భరత్‌లాల్ మీనా


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న భరత్‌లాల్ మీనా, రూపా వాసుదేవన్

పుట్టపర్తి అర్బన్: క్రీడల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, బెంగళూరు గట్టి వ్యాలీ ఫౌండేషన చైర్మన్ భరత్‌లాల్ మీనా అన్నారు. గోరంట్ల మండలం గౌనివారిపల్లి వద్ద ఉన్న భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బెస్ట్–యూ)లో స్పోర్ట్స్‌డేను శనివారం ఆయన ప్రారంభించారు. బెస్ట్–యూనివర్సిటీ చాన్సలర్ రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.చితిరై చల్వన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 25వ తేదీ వరకూ జరిగే క్రీడా పోటీల్లో 60 జట్లు పాల్గొననున్నాయి. ఏపీలోని పలు జిల్లాలకు చెందిన జట్లతో పాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలివచ్చారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో బాలురు, బాలికలు పాఠశాల, ఇంటర్, డిగ్రీ స్థాయిలో పోటీ పడనున్నారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం టాస్ వేసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విజేత జట్లకు ఈ నెల 26న బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి బారతదేశ తొలి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్ అంజూబాబీ జార్జ్ హాజరు కానున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అడ్వకేట్ సుబ్రహ్మణ్య, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ నితిన్ పాల్గొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న రైల్వే ఏజీఎం

గుంతకల్లు రూరల్: రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ రెడ్డి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలసి సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.


తీర్థ ప్రసాదాలు అందుకున్న రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ దంపతులు

అక్రమ మద్యం స్వాధీనం

తాడిపత్రి: స్థానిక ఆటోనగర్‌లో టాటా ఏస్ వాహనంలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మహారాష్ట్రకు చెందిన 200 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న వాహన యజమాని, అక్రమ మద్యం రవాణాదారుల కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు వీరనారాయణ

చెన్నేకొత్తపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లికి చెందిన వీరనారాయణ (45) ఉమ్మడి పొలంలో వ్యవసాయంతో పాటు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వీరనారాయణ ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుమారుడు అరవింద్ భోజనం తీసుకుని పొలానికి వెళ్లాడు. అక్కడ తండ్రి కనిపించకపోవడంతో సోదరుడు వీరాంజనేయులుతో కలసి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. చీనీ తోటలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వీరనారాయణను గమనించి వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే మృతుడు దుస్తులు తొలగించి మహిళలు ధరించే జాకెట్ తొడిగి ఉండడంతో పాటు సంఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు పడి ఉండడంతో వీరనారాయణ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కేంద్ర మంత్రి దేవాసిన్హ్ చౌహాన్

ప్రశాంతి నిలయం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ శ్రేణులకు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవాసిన్హ్ చౌహాన్ సూచించారు. శనివారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పెడబల్లిలో బీజేపీ కార్యకర్తల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్ర సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవదర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత సురతాని, జిల్లా అధ్యక్షుడు వజ్రాభాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి దేవాసిన్హ్ చౌహాన్ ఆదివారం పుట్టపర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అంతకుముందు కేంద్ర మంత్రి దేవాసిన్హ్ చౌహాన్‌ను కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మర్యాద పూర్వకంగా కలిశారు.


మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

మహాసమాధిని దర్శించుకున్న మహారాష్ట్ర మాజీ సీఎం

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ శనివారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తికి చేరుకున్న ఆయనకు శాంతిభవన్ వద్ద సత్యసాయి ట్రస్ట్ వర్గాలు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం సాయికుల్వంత్ సభా మందిరం వద్ద కేంద్ర మంత్రి దేవాసిన్హ్ చౌహాన్‌తో కాసేపు ముచ్చటించారు.

ముగిసిన ఎస్జీటీల వర్క్ అడ్జెస్ట్‌మెంట్

అనంతపురం: డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ (30 శాతం)కోటాలోని సీనియర్ ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్లు (స్కూల్ అసిస్టెంట్)గా అవకాశం కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగిసింది. సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియకు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)కు మొత్తం 140 మందిని ఆహ్వానించగా, 50 మంది, స్కూల్‌అసిస్టెంట్ (మేథమేటిక్స్)కు సంబంధించి మొత్తం 60 మందికి గాను, 19 మంది సమ్మతి తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌స్టడీస్‌కు మొత్తం 15 మందికి గాను, కేవలం ఒకరు మాత్రమే సమ్మతి తెలిపారు.

టీడీపీ నేతల అరెస్ట్

రామగిరి/కనగానపల్లి: ఎలాంటి అనుమతుల్లేకుండా ఆందోళన చేసేందుకు వెళుతున్న పలువురు టీడీపీ నేతలను అరెస్ట్ చేసి, రామగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ జనార్దన నాయుడు తెలిపారు. కనగానపల్లి మండలం భానుకోట సమీపంలో మంత్రి ఉషశ్రీచరణ్ స్థలాన్ని పరిశీలించి ఆందోళనకు చేపట్టేందుకు వెళుతుండగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పతో పాటు టీడీపీ మహిళా నేత సవిత, మరో ఇద్దరిని అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు వివరించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడినా, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి హెచ్చరించారు. మండలంలోని భానుకోటలో వ్యవసాయ భూముల వద్ద శనివారం ఆందోళన చేపట్టేందుకు వెళుతున్న టీడీపీ నాయకులను కనగానపల్లి పోలీసులు అరెస్టు చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్ట్ అయిన వారిలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, తెలుగు యువత నాయకులు ఉన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. పోలీసుల అనుమతి లేకుండా సమస్యాత్మక గ్రామాల్లో ఆందోళన చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎవరు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఉద్యోగికి గాయాలు

తాడిమర్రి: విద్యుత్ స్తంభంపైకి ఎక్కి వైర్లు అనుసంధానం చేస్తుండగా షాక్‌కు గురై కాంట్రాక్ట్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తాడిమర్రికి చెందిన రైతులు బైపిరెడ్డి గారి గంగాధరరెడ్డి, గంగిరెడ్డికి చెందిన చీనీ తోటలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు శనివారం విద్యుత్ వైర్లు అనుసంధానించేందుకు కాంట్రాక్ట్ ఉద్యోగి గంగులకుంట భరత్‌రెడ్డి సిద్ధమయ్యాడు. ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభం ఎక్కిన భరత్‌రెడ్డి... కటింగ్ ప్లేయర్‌తో విద్యుత్ తీగల ఇన్సులేటర్ తొలగిస్తుండగా ఒక్కసారిగా షాక్ గురయ్యాడు. ఆ సమయంలో చెలరేగిన మంటలు భరత్‌రెడ్డిని చుట్టుముట్టాయి. దీంతో స్తంభంపై నుంచి కిందకు పడుతున్న భరత్‌రెడ్డిని స్థానిక రైతులు పట్టుకుని మంటలు ఆర్పి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్ర, డీఈ రమేష్, ఏఈ విజయ్‌శేఖర్.. ఆస్పత్రికి వెళ్లి బాధితుడ్ని పరామర్శించారు.

స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకం

ధర్మవరం రూరల్: శ్రీకాకుళం జిల్లాలో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) టోర్నమెంట్‌లో 100 మీటర్ల రిలే పరుగు పందెంలో మండల పరిధిలోని గొట్లూరు గ్రామానికి చెందిన డి. హరిశంకర్ అనే విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ విద్యార్థి వైఎస్సార్ జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థికి పలువురు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు.


గోల్డ్‌మెడల్ సాధించిన డి. హరిశంకర్

నాడు–నేడు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చేపట్టిన మనబడి నాడు–నేడు పనులను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈఓ) రఘునాథరెడ్డి శనివారం పరిశీలించారు. అదనపు తరగతి నిర్మాణాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని ప్రిన్సిపాల్ బషీర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట అధ్యాపకులు హాఫీజ్, శంకర్‌నాయక్, మూర్తి, హాజీపీరా ఉన్నారు.

వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్, డైరెక్టర్ల పదవీ కాలం పొడగింపు

మడకశిర: కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్, డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మడకశిరకు చెందిన డాక్టర్ నళిని, డైరెక్టర్లుగా మడకశిరకు చెందిన డాక్టర్ దేవరాజు, నాగరాజగౌడ్, నాగన్న, ఈరక్యాతరాయప్ప, అనిత, నేత్రావతి, అన్నపూర్ణమ్మ, నాగలక్ష్మమ్మ, గగన, రాజేశ్వరి, పలమనేరుకు చెందిన విశాలాక్షి, కళ్యాణదుర్గానికి చెందిన సుజాత ఉన్నారు. వీరి పదవీ కాలం గత ఏడాది డిసెంబర్ 17న ముగిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గం పదవీ కాలాన్ని పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ వీరందరూ ఆయా పదవుల్లో కొనసాగనున్నారు. అలాగే బోయ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, బిదురమ్మ పదవీ కాలాన్ని పొడగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న రాధమ్మ గుడిబండ ఎంపీపీగా ఎన్నికైంది. ఈ నేపథ్యంలో ఆమెను డైరెక్టర్ పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. కాగా పదవీ కాలం పొడగించడంపై స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమంలో మీడియా పాత్ర కీలకం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు

అనంతపురం సిటీ: ప్రజా సంక్షేమంలో మీడియా పాత్ర కీలకమని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు అన్నారు. న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో చట్టాలపై విలేకరులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ పలు సందర్భాల్లో పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించి, సుమోటోగా కేసులు నమోదు చేసిన ఉదంతాలను వివరించారు. వినియోగదారుల చట్టాలపై వినియోగదారుల సంఘం జిల్లా సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్ అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం, డిఫెన్స్ లీగల్ కౌన్సెల్ విధానం, పర్యావరణ పరిరక్షణ చట్టాల గురించి డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సెల్ నల్లప్ప, నగర పాలక సంస్థ లీగల్ స్టాండింగ్ కౌన్సెల్ ఉమాపతి, మధ్యవర్తిత్వ కేంద్రం సభ్యుడు హరికృష్ణ తదితరులు మాట్లాడారు.


మాట్లాడుతున్న దీనబాబు